క్లుప్తంగా

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ



బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథచారి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం సాయంత్రం సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాల్లోని వసతి గదులు, వంట గదులు, బాత్రూంలు పరిశీలించారు. వంట గదులు, బాత్ రూంలు అపరిశుభ్రంగా ఉండటంతో వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు సిబ్బంది సాదిక్ పాల్గొన్నారు.

18న మండల సమావేశం

పెద్దవడుగూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, పశుపోషణ, ఏపీఎం వెలుగు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, ప్రాథమిక ఆరోగ్యం, తాగునీరు, రెవెన్యూ, గృహనిర్మాణం, విద్యుత్, ప్రాథమిక విద్య, ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, పండ్లతోటలు, గ్రామ పంచాయతీలు , అటవీశాఖ, ఏపీఎస్‌ఆర్టీసీ, రోడ్లు, భవనాలు, మైనర్ ఇరిగేషన్, పట్టు పరిశ్రమ, చేపల ఉత్పత్తి తదితర శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

నీటి సమస్యపై సత్వరమే స్పందించండి



నాన్ పీహెచ్ వర్కర్ల మస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాగునీటి సమస్యలపై వాటర్‌వర్క్స్ సిబ్బంది వెంటనే స్పందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాన్ పీహెచ్ వర్కర్ల మస్టర్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. పైప్ లైన్ లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అలాగే వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని ఆయన లైటింగ్ సెక్షన్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

17న వాల్మీకి జయంతి

పామిడి: పట్టణంలో ఈనెల 17న నిర్వహించే వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వాల్మీకి మహర్షి పామిడి మండల అధ్యక్షుడు ఎం.ఎస్‌ఈశ్వరయ్య మంగళవారం కోరారు. వేడుకల్లో భాగంగా ఆ రోజు వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు.


బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



రైల్వే మహిళా కార్మికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే డీజిల్ షెడ్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం రైల్వే ఆస్పత్రి వైద్యులు వెంకటేష్ ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళా కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే డాక్టర్ వెంకటేష్, డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, హెడ్ నర్స్ ఝాన్సీ మాట్లాడారు. బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపు, నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సంధ్య, రైల్వే అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రత.. ఆరోగ్యానికి భద్రత



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: చేతుల పరిశుభ్రతతో అంటు వ్యాధులను అరికట్టవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమీషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఏపీ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల ఆర్పీ, లీడర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగాలు శరవేగంగా వ్యాపించడానికి, అంటువ్యాధులు విజృంభించడానికి చేతులు శుభ్రంగా లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో మెప్మా టీపీ ఆర్‌ఓ మోహన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ హరినాథ్, సీఎంఎం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా చెత్తే..

స్వచ్ఛతా హీ సేవ, క్లీన్ ఆంధ్రప్రదేశ్ అంటూ పరిశుభ్రతపై ప్రభుత్వం, అధికారులు ఊరూరా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. గుత్తి పట్టణంతోపాటు గుత్తి ఆర్‌ఎస్‌లోని పలు కాలనీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. డ్రైనేజీ ముందుకు సాగక నడిరోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో పాటు చెత్త సేకరణ కూడా సక్రమంగా జరగడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీ: గుత్తి	
వార్డులు:	25
జనాభా :	49,000



కుమ్మర వీధిలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తా చెదారం



ఉప్పర వీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- అపరిశుభ్రతకు కేరాఫ్ గుత్తి మున్సిపాలిటీ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ చెత్తమయంగా మారింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు, అపరిశుభ్రత తాండవిస్తోంది. డ్రైనేజీ కాలువలు సక్రమంగా శుభ్రం చేయపోవడంతో మురుగు నీరంతా ఇళ్ల ముందు, రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. తద్వారా మున్సిపల్ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, మున్సిపల్ శానిటరీ మేస్త్రీలు, శానిటరీ వర్కర్లు, మున్సిపల్, సచివాలయాల హెల్త్ అసిస్టెంట్లు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదు. ఎక్కడ చూసినా చెత్త దర్శనమివ్వడంతో పాటు డ్రైనేజీ కాలువల్లోని మురుగు నీరంతా రోడ్లపై పారుతున్నాయి. దీంతో దోమలు, ఈగలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా కుమ్మర వీధి, ఉప్పరవీధి, ఓల్డ్ సీఐ బంగ్లా వద్ద, ఓల్డ్ సీపీఐ కాలనీ, గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లోని ఎస్సీ కాలనీలు, గుత్తి ఆర్‌ఎస్‌లో హోరబ్ చర్చి ఏరియా చెత్తాచెదారం పేరుకుపోయింది. అలాగే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు

అపరిశుభ్రత కారణంగా దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చిరుజల్లులతో కూడిన వర్షానికి ఎక్కడ చూసిన నీరు నిలిచి అపరిశుభ్రత తాండవిస్తోంది. దీని వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చిగన్‌గున్యా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే చాలు పట్టణవాసులు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పరిశుభ్రత పనులు చేపట్టాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీలో చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకుంటాం. శానిటరీ వర్కర్లు తక్కువగా ఉండటం వల్ల కొన్ని ప్రాంతాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. త్వరలోనే మురుగు కాలువలు రెగ్యులర్‌గా శుభ్రం చేయించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

– మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా

చెత్తాచెదారం తొలగించాలి



మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి, వీధుల్లో చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలి.

–కృష్ణమూర్తి, గుత్తి

డ్రైనేజీలను శుభ్రం చేయాలి



డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. తద్వారా మురుగునీరంతా రోడ్లపై, ఇళ్ల ముందు నిల్వ ఉంటోంది. దీంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలను రెగ్యులర్‌గా శుభ్రం చేయించాలి. డ్రైనేజీల్లో మురుగు ముందుకు పారక దోమలు విజృంభిస్తుండడంతో ఆస్పత్రుల పాలవుతున్నాం.

–నర్రి, గుత్తి ఆర్‌ఎస్

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు

శింగనమల: మండలంలోని పి.జలాలపురం, చీలేపల్లి, తరిమెల, కల్లుమడి వంకల నుంచి సోమవారం రాత్రి అక్రమంగా ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలించారు. పి.జలాలపురం వద్ద ఉన్న వంకను టీడీపీ నాయకులు అక్రమించుకుని జేసీబీతో ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లలో లోడ్ చేస్తూ కప్పం కట్టించుకుంటున్నారు. టిప్పర్‌కు రూ.7 వేలు, ట్రాక్టర్‌కు రూ.1,500 వసూలు చేస్తున్నారు. మండలంలో ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తరలిస్తున్నా, రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకులు ఇసుకను అక్రమంగా భారీ స్థాయిలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పి.జలాలపురం వంక నుంచి రాత్రి వేళ ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ కార్యకర్తలు

అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం

యాడికి: మద్యం దుకాణం ఏర్పాటు సందర్భంగా మండల కేంద్రంలో గొడవలను సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ ఈరన్న హెచ్చరించారు. మండల కేంద్రంలో రహదారి పక్కనే ఉన్న నాగార్జున కాంప్లెక్స్‌లో గత 10 సంవత్సరాలుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఎంపీటీసీ సభ్యుడు గొడ్డుమర్రి రామ్మోహన్ పేరిట మద్యం దుకాణానికి లాటరీ తగలడంతో ఇదివరకే నిర్వహిస్తున్న షాపులోనే నూతనంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కాంప్లెక్స్ ఓనర్‌తో బొంబాయి రమేష్ నాయుడు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వారికి షాపు ఇవ్వకూడదని మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి హల్‌చల్ చేశారు. బొంబాయి రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మద్యం దుకాణం వద్దకు తరలివచ్చారు. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న తన సిబ్బందితో ఇరువర్గాలను చెదర గొట్టారు. మంగళవారం సీఐ ఈరన్న మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాలు బంద్ చేయించి పరిసరాల్లో ఉన్న టీస్టాళ్లు, దుకాణాలు, అంగళ్లను మూసి వేయించి బందోబస్తు నిర్వహించారు.



యాడికిలో దుకాణాలు మూసివేయిస్తున్న సీఐ ఈరన్న

సీపీఎం బస్సుయాత్రను జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్/పామిడి: సాగునీటి సాధన కోసం మంగళవారం నుంచి ఈ నెల 20 వరకూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈయాత్ర 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుందని, పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు. హంద్రీనీవా కెనాల్ ద్వారా రాగులపాడు లిఫ్ట్ నుంచి నియోజకవర్గంలోని 13 చెరువులకు నీరందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతి, రమేష్, నాగరాజు పాల్గొన్నారు. అలాగే పామిడిలో సీపీఎం నాయకులు అనిమిరెడ్డి, మల్లేశు మాట్లాడారు. పామిడిలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద 17వ తేదీ నిర్వహించే సీపీఎం సాగునీటి బస్సుయాత్ర బహిరంగ సభకు రైతులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

కొనసాగుతున్న 'పల్లె పండుగ'

పుట్లూరు/గుత్తిరూరల్/గార్లదిన్నె/పామిడి/యల్లనూరు/పెద్దవడుగూరు: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పుట్లూరు మండలంలోని అరకటివేముల గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి పర్యటించారు. ఈ సందర్భంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ, శిలాఫలక ఆవిష్కరణ చేపట్టారు.కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఏపీఓ చెన్నకేశవులు, టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య తదితరులు డిమాండ్ చేశారు. గుత్తి మండలంలోని పెద్దొడ్డి, రజాపురం, తురకపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, పీఆర్ ఏఈ మల్లేష్‌నాయక్, ఏపీఓ మద్దిలేటి భూమిపూజ చేశారు. అలాగే గార్లదిన్నె మండలంలోని శిరివరం, కనంపల్లి, తిమ్మంపేట గ్రామ పంచాయతీల్లో, పామిడి మండలంలోని ఎద్దులపల్లి, యల్లనూరు మండలంలోని తిరుమలాపురం, చిలమకూరులో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండలంలోని మేడిమాకులపల్లి, చింతలచెరువు, చిత్రచేడు, చిట్టూరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, ఏపీఓ పుల్లారెడ్డి, ఈఓఆర్‌డీ నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఆంజినేయులు పాల్గొన్నారు.



పుట్లూరు మండలం అరకటివేములలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



తాడిపత్రిలో గ్యార్మీ జెండా ఊరేగిస్తున్న ముస్లింలు



పెద్దపప్పూరులో స్వామి జెండాలను ఊరేగిస్తున్న ముస్లింలు

తాడిపత్రి అర్బన్/తాడిపత్రి రూరల్/పెద్దపప్పూరు: గ్యార్మీ పండుగ వేడుకలను తాడిపత్రి పట్టణంలోని ముస్లింలు మంగళవారం భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. ముస్లిం మత పెద్దల సమక్షంలో ముస్లింలు స్థానిక జెండా కట్టలను అలంకరించారు. అనంతరం మేళతాళాలు, డప్పు సన్నాయి వాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో గ్యార్మీ జెండా ఊరేగించారు. కులమతాలకతీతంగా గ్యార్మీ జెండాకు పూజలు నిర్వహించి చక్కెర ఫాతెహాలు చదివించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ సమీపంలోని ఆర్డీటీ కాలనీలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అలాగే పెద్దపప్పూరు మండలకేంద్రంలో దస్తగిరిస్వామి జెండాల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చాగల్లు గ్రామసమీపంలో వెలసిన దస్తగిరిస్వామికి దర్గా నిర్వహకులు గంధంతోపాటు జెండాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు.అలాగే పెద్దపప్పూరు గ్రామానికి చెందిన హజారుద్దీన్ భక్తిశ్రద్ధలతో జెండాల ఊరేగింపు నిర్వహించారు, మైనార్టీ నాయకుడు షేక్షావలి, ముస్లిం మతపెద్దలు, ముజావర్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం ఉండాలి

గుంతకల్లు: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం ఉండాలని టూటౌన్ సీఐ మస్తాన్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోని సైబర్ నేరగాళ్ల వల చిక్కకుండా జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో వచ్చే లింకులు క్లిక్ చేయరాదన్నారు.

ఈ–పంట నమోదుపై సోషల్ ఆడిట్

శింగనమల: మండలంలోని శింగనమల, ఆకులేడు, వెస్ట్ నరసాపురం, తరిమెల, కొరివిపల్లి, కల్లుమడి రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేసిన ఈ–పంట వివరాలను సోమవారం సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. వివరాలను ప్రతి రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉంచామని రైతులు పేర్లను సరి చూసుకోవాలని ఆయన కోరారు.

పేకాట స్థావరాలపై దాడి

యల్లనూరు: మండలంలోని గడ్డంవారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ రాంప్రసాద్ తన సిబ్బందితో మంగళవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాటరాయుళ్లు మహేష్, శేఖర్‌తో పాటు మరో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.34,450 నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం


అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

శింగనమల/యల్లనూరు: తుపాను కారణంగా బుధవారం నిర్వహించాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు సీడీపీఓ ఉమాశంకరమ్మ మంగళవారం తెలిపారు. శింగనమల ప్రాజెక్ట్ పరిధిలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం మండలాల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గుర్తించాలన్నారు. అలాగే నార్పల ప్రాజెక్టు పరిధిలో బుధవారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు నార్పల సీడీపీఓ భారతి తెలిపారు. ఇంటర్వ్యూలను ఈనెల 23న నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

పామిడి: పట్టణంలోని నాగిరెడ్డికాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తాజ్‌బాబా(50) మృతిపై మంగళవారం వైఎస్సార్‌సీపీ పార్టీశ్రేణులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి ఆయన గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు. సమాచారం అందుకున్న పార్టీ నాయకులు అతడి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్ రెడ్డి, ముతువలీ బీకే రహీమ్, తుల్లాబాయ్, ప్రవీణ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థినులు కెప్టెన్ గౌతమి, సుహానాను టెక్ కళాశాల చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో అభినందించారు. అనంతపురం నుంచి జాతీయస్థాయికి ఎంపికవడంపై రమేష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

యాడికి: మండలంలోని వెంగన్నపల్లిలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సుమాంజనేయులు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటి వరకూ దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. చెకప్ కోసం అతడిని ఈ నెల 17న హైదరాబాద్‌కు తీసుకుపోవాల్సి ఉంది. అక్కడకు వెళ్లేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతుండడంతో.. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దీంతో సుమాంజనేయులు కుటుంబసభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

తాడిపత్రి అర్బన్: ఇంటి ముందు కూర్చున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన ఘటన మంగళవారం పట్టణంలోని సీపీఐ కాలనీలో చోటు చేసుకుంది. అర్బన్ సీఐ సాయిప్రసాద్ వివరాల మేరకు.. సీపీఐ కాలనీకి చెందిన వృద్ధురాలు రంగమ్మ మంగళవారం తన ఇంటి ముందు కూర్చుని ఉండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి ఆమె వద్దకు వచ్చాడు. మాట్లాడుతున్నట్లు నటించి వెంటనే రంగమ్మ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని రేకులకుంట హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది శానిటరి వర్కర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ మోహన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు

తాడిపత్రి రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కమిషనర్ శివరామక్రిష్ణ మంగళవారం తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బందులు పడేవారు 9849907425, 08558 222229 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

అప్రమత్తంగా ఉండండి

పామిడి: రాగల రెండురోజుల్లో భారీ వర్షాలు పడే అస్కారం ఉన్నందున రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి సూచించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో వేర్వేరుగా సమావేశమై మాట్లాడారు. భారీవర్షాల వల్ల వంకలు, కాలువలు, చెరువులు పొంగిపొర్లితే ప్రజలను జాగృతి పరిచి, సమాచారాన్ని తహసీల్దార్ కార్యాలయ కంట్రోలు రూంకు అందించాలన్నారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీనారాయణరెడ్డి, సర్వేయర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలకు సెలవు

తాడిపత్రిటౌన్/యాడికి: పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు తాడిపత్రి, యాడికి ఎంఈఓలు నాగరాజు, కాశెప్ప మంగళవారం తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలకు మేరకు సెలవు ప్రకటించామన్నారు.

హనుమద్ వాహనంపై శ్రీవారు



తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి చింతల వెంకటరమణ స్వామి హనుమద్ వాహనంపై విహరించారు. సాయంత్రం ఆలయంలో స్వామిని హనుమద్ వాహనంపై అధిష్టించి భక్తులను కటాక్షించారు.

శ్రమదానంతో జగనన్న కాలనీకి రోడ్డు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి జగనన్న కాలనీకి రోడ్డు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీవాసులు మంగళవారం శ్రమదానంతో తాత్కాలిక రోడ్డు నిర్మించుకున్నారు. మురుగు పోయేందుకు పెద్ద పైపులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కాగా గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కొందరు రోడ్డు వేయకుండా మున్సిపల్ అధికారులను అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.


అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

గుంతకల్లు/గుంతకల్లు టౌన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక 60 అడుగుల రోడ్డులోని దర్శక ట్యుటోరియల్స్ కరస్పాండెంట్ మస్తానయ్య అధ్యక్షత జరిగిన అబ్దుల్‌కలాం జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టూటౌన్ సీఐ మస్తాన్, వైద్యుడు జిలాన్ హాజరై మాట్లాడారు. అలాగే 60 అడుగుల రోడ్‌లోని కలాం విగ్రహానికి విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థిసేన కార్యదర్శి మహేష్‌గుప్త, నాయకులు నాగరాజు, మహ్మద్,ప్రతాప్, చిన్న, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పామిడి: సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని జీ కొట్టాల, కాలాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ డీ లీనా వసుంధర ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లోని వేరుశనగ, వరి, జొన్న పంటల సాగు పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమాల్లో వీహెచ్‌ఏ చిరంజీవి, ఎంపీఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో తనిఖీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్/గుత్తి రూరల్: తాడిపత్రి మండలంలోని తలారిచెరువు, ఊరుచింతల గ్రామాల్లో మంగళవారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తనిఖీలు చేశారు. ఫ్యాక్షన్ గ్రామాలు కావడంతో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఉండాలని స్థానికులకు సీఐ సూచించారు. అలాగే గుత్తిమండలంలోని టి.కొత్తపల్లిలో సిబ్బందితో కలసి ఎస్‌ఐ సురేష్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత కేసుల్లో నేరస్తులు, అనుమానితుల ఇళ్లలో తనిఖీ చేశారు. అనంతరం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాత కేసుల్లోని నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం గ్రామంలో సరైన రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.